# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 89 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 30 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 89 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 30 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే జయసుధ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ప్రముఖ సినీనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ బీజేపీలో చేరనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జయసుధ కాషాయ కండువా కప్పుకో నున్నాన్నారు. 2009లో కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా జయసుధ గెలుపొందారు. సికింద్రాబాద్ లేదా ముషీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా జయసుధ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రాష్ట్రం ఆగమాగం..!

■ వరద పరిస్థితిని సమీక్షించిన కేసీఆర్ ■ వేలాది ఎకరాల పంట నీటి మునక ■ ధ్వంసమైన రోడ్లు, వంతెనలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో గత వారం రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో అనేక చోట్ల రోడ్లు, ఇళ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో వర్షాల ప్రభావానికి రాష్ట్రంలో మొత్తంగా 49 బ్రిడ్జీలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే చాలావరకు రహదారులు కోతకు గురైనట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కాస్తంత తగ్గుముఖం పట్టాయి. కొన్ని జిల్లాల్లో మాత్రం మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే వర్షాలు తగ్గడంతో.. వరదలు తగ్గుముఖం పట్టి బురద మయమైన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాల పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి

మిగతా 2లో...

## అసెంబ్లీ సమావేశాలకు అంతా రెడీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఆగస్టు 3వ తేదీ నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు సిద్ధమైంది తెలంగాణ సర్కార్. ఆగస్టు ఆగస్టు 3 నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇదే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో... శాసనసభ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం ఉంది. ఇక ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక

మిగతా 2లో...

## చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

ఉన్నతాధికారులతో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సహాయక చర్యలపై కలెక్టర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి. సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇతర శాఖలతో మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిండిన చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలకు ప్రతి జిల్లాలో కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు

మిగతా 2లో...

## బీజేపీ సీఎం అభ్యర్థిగా పురందరేశ్వరీ..?



ఒంగోలు- ప్రభాత సూర్యుడు

పొలిటికల్ వర్గాల్లో ఇదో హాట్ టాపిక్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమార్తె కూడా దగ్గుపాటి పురందేశ్వరి ఈసారి ఎన్నికలలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగబోతున్నారట. 2024 ఎన్నికల్లో దగ్గుపాటి పురందేశ్వరి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బరిలోకి దిగాలని భావిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి విశాఖ పర్యటన నేపథ్యంలో పలు ఊహాగానాలు మొదలయ్యాయి.

మిగతా 2లో...

## వైరల్ వీడియోపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

మణిపూర్ వైరల్ వీడియో కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రెండ్రోజుల క్రితమే సుప్రీంకోర్టులో కేంద్రం ఓ

మిగతా 2లో...

## బండి సంజయ్‌కు జాతీయ కార్యదర్శి పదవి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అధికారం దక్కించుకోవడం బీజేపీ అనేక వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల రాష్ట్ర జాతీయ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తప్పించి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. బీజేపీ పార్టీకి తెలంగాణలో ఒక ఊపు తెచ్చిన బండి సంజయ్‌ను ఈ బాధ్యతల నుంచి తప్పించడంపై చాలా మంది కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. అయితే బండి సంజయ్‌కు మరో పదవి ఇస్తారని ఇటీవల జోరుగా ప్రచారాలు జరిగాయి. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ అధిష్ఠానం కీలక

మిగతా 2లో...

## ఓరుగల్లుకు తీరని శోకం

వందలాది మంది నిరాశ్రయులు ● హెలికాప్టర్ సహాయంతో ప్రజలను కాపాడేందుకు చర్యలు

వరంగల్- ప్రభాత సూర్యుడు



వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు తెలంగాణ రాష్ట్రాన్ని అతలాకుతం చేశాయి. రాత్రి పగలు ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు వందలాది మంది నిరాశ్రయులు అయ్యారు. చెరువులు ఏరులై పారాయి. దీంతో ఇళ్లల్లోకి నీరు చేరడమే కాకుండా.. గాలివానకు ఇళ్ల పైకప్పు ఎగిరిపోయాయి. కొందరు నీళ్లల్లో కొట్టుకు పోగా మరికొందరు మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. హెలికాప్టర్ సహాయంతో ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకుంది. వర్షం వరదలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహావిషాదం జరిగింది. ములుగు జిల్లాలో 13 మంది, హనుమకొండ జిల్లాలో ఐదుగురు, మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు, భూపాలపల్లిలో ముగ్గురు మృతి చెందారు. భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చెందిన గల్లంతైన వారిలో గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ, కోసం కోనసాగుతున్న గాలింపు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా బూరుగుపేటకు చెందిన బండ సారమ్మ, రాజమ్మ, ప్రాజెక్టు నగర్ కు చెందిన 4ఏళ్ళ బాలుడు సద్దాం అలీగా గుర్తించారు. వర్షం వరదలతో గ్రేటర్ వరంగల్ తో పాటు ములుగు,

మిగతా 2లో...

## వరదల్లో 18 మంది మృతి

### 12 మంది మిస్సింగ్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలోని భారీ వర్షాలు, వరదలు పలుచోట్ల తీవ్ర విషాదాన్ని నింపాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18 మందికిపైగా మృతి

మిగతా 2లో...

# వరదల్లో 18 మంది మృతి

## 12 మంది మిస్సింగ్

(మొదటిపేజీ తరువాయి)

చెందారు. గల్లంతు అయిన వారిలో కొందరి ఆచూకీ లభ్యం కాకపోవటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది రాష్ట్రంలో భారీగా కురుసిన వర్షాల దాటికి జనజీవనం అస్తవ్యవస్తమైపోయింది. మరోవైపు వరదల దాటికి పలు జిల్లాల్లో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. గత మూడు రోజుల్లో వాగులు, వరద నీటిలో పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. ఇప్పుడిప్పుడే చాలా మంది మృతదేహాలు లభ్యమవుతున్నాయి. వారిలో కొందరి మృతదేహాలు గురు, శుక్రవారాల్లో బయటపడ్డాయి. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 18 మందికిపైగా మృతి చెందారు. గల్లంతైన వారి సంఖ్య ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉందని తెలుస్తోంది. ప్రధానంగా? ములుగు జిల్లా జంపన్నవాగు వరదలో గల్లంతైన 15మందిలో ఎనిమిది మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. దీనిపై మంత్రి సత్యవతి రాథోడ్ కూడా ప్రకటన చేశారు.ములుగు జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తు్న భారీ వర్షాలకు జనజీవనం స్థంభిచిపోయింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామంలో గురువారం వరదలో గల్లంతైన 11 మంది మృతి చెందారు. శుక్రవారం వీరి మృతదేహాలు లభించాయి. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వనున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. తక్షణ సాయం కింద రూ. 25 వేల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.వరదల దాటికి ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రాణ నష్టం ఎక్కువగా జరిగింది. ఇక ఖమ్మం జిల్లాలోనూ వరదల తీవ్రత అధికంగా ఉంది. జలగంనగర్ వద్ద మున్నేరు వరదలో గురువారం గల్లంతైన వ్యక్తి మృతదేహం కూడా లభ్యమైంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం పరిధిలో కూడా ఒక మృతదేహం చిక్కింది. ఆసిఫిబాద్, కొత్తగూడెం జిల్లాలో కూడా గల్లంతైన పలువురు చనిపోయారు. ఇక 12 మందికిపైగా గల్లంతైన వారి ఆచూకీ తెలియాల్సి ఉంది మరోవైపు గోదావరికి క్రమంగా వరద ఉద్ధృతి పెరుగుతోంది. ఫలితంగా భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 53 అడుగుల? దాటిపోయింది. దీంతో అధికారులు 3వ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే 430 గ్రామాలకు చెందిన ప్రజలను 40 పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద బాధిత ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి. వరదల పరిస్థితిపై సమాచారం అడిగి తెలుసుకున్నారు.

# చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్నారు. రహదారులపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా పారిశుధ్య డ్రైవ్‌ని చేపట్టాలన్నారు. ప్రజలు మంచినీరు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాలు తొలగగించాలి. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకొని మరమ్మతులు చేయాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు.

# బండి సంజయ్‌కు జాతీయ కార్యదర్శి పదవి

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. బీజీపీ జాతీయ నాయకత్వంలోకి బండి సంజయ్‌ను ఆహ్వానించింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయనకి బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. కమల అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంపై బండి సంజయ్ అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలిగా తెలంగాణ నుంచి డీకే అరుణ కొనసాగనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కార్యదర్శిగా సత్య కమార్ కొనసాగనున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ ఇప్పటికే ఢిల్లీకి బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం నుంచే మరో లీడర్ డీకే అరుణకి కూడా జాతీయకార్యవర్గంలో మరోసారి చోటు లభించింది. ఆమెను జాతీయ ఉపాధ్యక్షరాలిగా కొనసాగిస్తున్నారు. ఏపీ నుంచి సత్యకుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా కొనసాగిస్తున్నారు. ఆయన్ని ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా పురందేశ్వరిని అధ్యక్షురాలిగా చేసింది అధినాయకత్వం. అందుకే సత్య కుమార్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా కంటిన్యూ చేశారు.

# రాష్ట్రం ఆగమాగం

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ రెండో రోజు క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులతో సమిక్ష నిర్వహించారు. వరద ముంపుకు గుర్రైన ప్రాంతాల్లో సాగుతున్న సహాయక, పునరావాస చర్యలపై మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు.ఇంకొన్నింటపై గుంతలు పడ్డాయని పేర్కొన్నారు.భారీ వర్షాలు, వరదలతో వరంగల్ నగరం అతలాకుతలమవుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా వరద ప్రవాహం వరంగల్ నగరాన్ని చుట్టుముట్టింది. దీంతో నగరం మొత్తం జలమయంగా మారింది. కాగా.. వరద పోటెత్తడంతో వరంగల్‌లోని భద్రకాళి చెరువుకు గండి పడింది. భద్రకాళి చెరువు కట్ట పోతన నగర్ వైపు కోతకు గుర్రైంది. చెరువుకు వరద పోటెత్తడంతో గండి పడినట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతికి చెరువు కట్ట తెగిపోయిందని.. ప్రజలు అప్రమత్తంగడా ఉండాలని సూచించారు. ప్రాచీన కాలం నాటి భద్రకాళి చెరువు కట్టకు గండి పడటంతో పోతననగర్, సరస్వతి నగర్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు హుటాహుటిన చెరుకుని భద్రకాళి చెరువు కింద ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. గండి పడిన ప్రాంతంలో ఉన్న కాలనీల వాసులు ఇళ్లు ఖాళీ చేయాలని పేర్కొన్నారు. పోతన నగరల్ వైపు వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో.. ఆయా ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు.ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో.. అన్ని ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే రెస్క్యూ టీం ఆయా ప్రాంతాలకు చేరుకుంటున్నారు. దిగువన ఉన్న ప్రజలను ఖాళీ చేయాలని సూచనలు చేస్తున్నారు.కాగా.. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరంగల్ నగరం తీవ్రంగా ప్రభావితమైంది.. అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. పలువురి రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వర్షాలు, వరదల ప్రభావంతో దాదాపు 10 మంది వరకు మరణించారు.

### 49 వంతెనలు ధ్వంసం

రాష్ట్రంలో మొత్తంగా 49 బ్రిడ్జీలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే చాలావరకు రహదారులు కోతకు గుర్రైనట్లు పేర్కొన్నారు. ఇంకొన్నింటపై గుంతలు పడ్డాయని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో శుక్రవారం సాయంత్రం వరకూ కూడా అనేక ప్రాంతాల్లో వరద ప్రవాహం కొనసాగింది. చాలా ప్రాంతాల్లో రాకపోకలు నిలిపివేశారు. జాతీయ రహదారులకు సంబంధించి 11 చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర రహదారుల విషయంలో 38 ప్రాంతాల్లో బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అత్యధికంగా 15 వంతెనలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. అలాగే జగిత్యాల జిల్లాలో 10 బ్రిడ్జిలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 , ఆదిలాబాద్‌లో 3 వంతెనలు దెబ్బతిన్నాయి. ఇంకా జనగామ, మంచిర్యాల, ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లల్లో చూసుకుంటో 2 చొప్పున బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 250 ప్రాంతాల్లో రహదారులపై వరద ప్రవహించినట్లు అధికారులు చెప్పారు. అదిలా ఉండగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని రహదారుల తాత్కాలిక మరమ్మతుల కోసం క్షేత్రస్థాయిలో ఉన్న నిధులు వాడుకోవాలని ప్రభుత్వం తెలిపింది. దాదాపు రూ.120 కోట్లు వాడుకోవాలని సూచించింది. ఒకవేళ భారీ మరమ్మతులు ఉంటే రాష్ట్రస్థాయికి ప్రతిపాదనలు పంపాలని కోరింది. అలాగే జాతీయ రహదారుల మరమ్మతు కోసం రూ.29 కోట్లు అవసరమని ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖను కోరినట్లు అధికారులు పేర్కొన్నారు.

### అంటువ్యాధులు రాకుండా చూడండి- సీఎం కేసీఆర్

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కాస్తంత తగ్గుముఖం పట్టాయి. కొన్ని జిల్లాల్లో మాత్రం మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే వర్షాలు తగ్గడంతో.. వరదలు తగ్గుముఖం పట్టి బురద మయమైన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాల పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో రోజు క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులతో సమిక్ష నిర్వహించారు. వరద ముంపుకు గుర్రైన ప్రాంతాల్లో సాగుతున్న సహాయక, పునరావాస చర్యలపై మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు. వరద ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బురదమయం అయిన ప్రాంతాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయసహకారాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వరదల నేపథ్యంలో ప్రజారోగ్యం, శ్రేయస్సును కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు వరద తాకిడి, ముంపునకు గుర్రైన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి హెచ్చరికలు చేస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహార పొట్లాలు, తాగు నీరు, మందులను హెలికాప్టర్ ద్వారా అందించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మూడో రోజు గోదావరి ముంపునకు గుర్రైన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

భారీ వర్షాలతో చెరువులు తెగడం, రహదారులు, బ్రిడ్జ్ లు కోతకు గురికావడంతో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఖమ్మం జిల్లా మున్నేరు వాగు తగ్గు ముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో భారీ వర్షాలు, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలపై మంత్రి సత్యవతి రాథోడ్ సమిక్ష చేపట్టారు. వరద ఉద్ధృతి తగ్గి పరిస్థితులు కుదుటపడుతున్న జీహెచ్ఎంసీ పరిధిలో సహాయక కార్యక్రమాలను కొనసాగించాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు తగ్గి పరిస్థితులు కుదుటపడుతున్నందున, పలువురు మంత్రులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ట కార్యాచరణను అనుసరించాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయ, పునరావాస చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున, వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

# ఓరుగల్లుకు తీరని శోకం

(మొదటిపేజీ తరువాయి)

భూపాలపల్లి జిల్లాలో అఫార నష్టం వాటిల్లింది. వరంగల్ లో వరద బురదలోనే ఇంకా 40 కాలనీలు ఉన్నాయి. జంపన్నవాగు ఉదృతితో కొండాయి గ్రామం జలదిగ్బంధంలోనే ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా పశువులు మృతి చెందారు. ములుగు జిల్లాలో ఐదు చెరువులకు గండ్లు, తెగిపోయిన 52 రోడ్లు, 43 ఇల్లు పూర్తిగా కూలిపోయాయి. పసర తాడ్వాయి మద్య గుండ్లవాగు బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో జాతీయ రహదారి 163పై రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యి కోట్ల వరకు నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచన వేశారు. వర్షం వరదలతో టిఎస్ ఎన్పీడిసిఎల్ కు ఏడుకోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఇంకా పలు గ్రామాలకు పవర్ సప్లై నిలిచిపోయింది.గోదావరి వరద ఉద్రతి పెరగడంతో గోదావరి ఎగువ భాగంలో జాతీయ రహదారి స్తంభించిపోయింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 55 అడుగులకు సమీపంలో ఉంది. దీంతో ఎగువ ప్రాంతంలో హైదరాబాదు, వరంగల్ నుంచి చత్తీస్ గడ్, ఒరిస్సా ఆంధ్రప్రదేశ్ ,ప్రాంతాలకు వెళ్లే జాతీయ రహదారిపై నీళ్లు చేరుకున్నాయి. దీంతో ఇప్పటికే ఈ ప్రాంతానికి వచ్చిన లారీలు అన్నీ కూడా రోడ్లమీద చిక్కుకొని పోయాయి భద్రాచలం నుంచి చెట్టు వరకు మధ్య మధ్యలో లారీలన్నీ నిలిచిపోవడంతో గోదావరి ఇంకా పెరుగుదల కనిపిస్తుండతో ఆ లారీలు అన్నిటిని కూడా తిరిగి భద్రాచలం వైపు మళ్ళిస్తున్నారు.కొమురం భీం జిల్లా సిర్పూర్ (టి) మం..వెంకట్రావు పేట్ అంతరాష్ట్ర బ్రిడ్జ్ పై నుండి పెనుగంగా (వార్దా) నది వరదనీరు ప్రవహిస్తుంది. మహారాష్ట్రకు రాకపోకలు నిలిచి పోయాయి. సిర్పూర్(టి) మం..హుడికిలి వద్ద రోడ్డు పైకి వచ్చిన బ్యాక్ వాటర్ సిర్పూర్(టి) నుండి జక్కాపూర్ మీదగా మహారాష్ట్ర కు రాకపోకలు నిలిచిపోయాయి. పారిగాం వద్ద ప్రధాన రోడ్డు పై ప్రవహిస్తున్న వరదనీరు. సిర్పూర్(టి)- కౌటాల మద్యలో రాకపోకలు నిలిచిపోయాయి. సిర్పూర్(టి) మండలంలో మూడు మార్గాలలో రాకపోకలు నిలిచిపోయాయి.గోదావరి వరదలతో చతిస్ గడ్ వెళ్లే జాతీయ రహదారి దిగ్బంధనాలకు గుర్రైంది. జాతీయ రహదారిలో అక్కడక్కడ వరద పట్టేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి .అయితే మరింతగా గోదావరి పెరుగుతుండడంతో కూనవరం రోడ్డులో మధ్యలో ఉన్న లారీలన్నీ చిక్కుకునిపోయాయి .అంతేకాదు హైదరాబాదు నుంచి ఒడిస్సా ఛత్తీస్ గడ్ వెళ్తున్న ప్రైవేటు బస్సులు కూడా చిక్కుకొని పోయాయి. గత అర్ధరాత్రి నుంచి ఈ బస్సులు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే భద్రాచలం పక్కన కూడా గోదావరి పెరుగుతుండడంతో ఈ బస్సులు అక్కడే ఉండటం ప్రమాదకరమని ఆ బస్సుల్ని భద్రాచలం వైపు తిప్పి పంపిస్తున్నారు.

# బీజేపీ సీఎం అభ్యర్థిగా పురందరేశ్వరీ..?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న జనసేనతో కలిసి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ అలయన్స్ గా పోటీ చేసే క్రమంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా పురందేశ్వరిని ప్రకటించాలన్న డిమాండ్ ప్రస్తుతం బీజేపీతో పాటు ఆమె అనుచరుల్లో పెద్ద ఎత్తున వినిపిస్తుందని టాక్.. పురందేశ్వరి ముఖ్యమంత్రి అభ్యర్థిగా జనసేనతో కలిసి ఎన్నికలకు వెళితే మంచి ఫలితాలు వస్తాయన్న లెక్కలు వేస్తున్నారట ఆమె అభిమానులు, బీజేపీ నేతలు.. రాష్ట్రంలో అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తి ఉన్నా ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం దాన్ని అవకాశంగా మలుచుకోలేకపోతుందని, ఆ వ్యాక్యూమ్ ను ఫిల్ చేయాలంటే ఒక ప్రధాన ప్రత్యామ్నాయం కావాలని, దానికి పురందేశ్వరి ముఖ్యమంత్రి అభ్యర్థిగా జనసేన, బిజెపి కలిసి వెళ్తే అయ్యే అవకాశం ఉందని దగ్గుపాటి అనుచరుల పొలిటికల్ తాజా విశ్లేషణ అట.

అందుకు అనువైన వాతావరణం రాష్ట్రంలో ఉందని పవన్ కళ్యాణ్ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 20 శాతం పైగా రాష్ట్రంలో ఉన్న కాపు, తెలగ, వంటరి, బలిజ సామాజిక వర్గాలతో పాటు పురందేశ్వరికి చెందిన కమ్మ సామాజిక వర్గాన్ని కలిపి ఉమ్మడి నాయకత్వంతో ముందుకు వెళ్లగలిగితే మిగతా వర్గాలు కూడా కలిసి వచ్చే అవకాశం ఉంటుందని.. ఇది కచ్చితమైన ప్రత్యామ్నాయం అవుతుందని విశ్లేషిస్తున్నారట. మాజీ కేంద్రమంత్రిగా రెండుసార్లు పార్లమెంటుకి వెళ్లిన అనుభవం ఉన్న నేతగా, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమార్తెగా, మంచి వాగ్ధాటి కలిగిన మహిళ నేతగా అనేక సానుకూల అంశాలు దోహదం చేస్తాయని, ప్రస్తుతమున్న రాష్ట్ర ప్రభుత్వంపై గట్టిగా ఈ ఆరు నెలలు ఫైట్ చేసినా ప్రజల్లో ఒక బలమైన నమ్మకాన్ని విశ్వాసాన్ని కలిగించగలిగితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంత సులభం కాకపోయినా అవకాశాలు ఉన్నాయని కూడా పార్టీ కేడర్ ఆలోచిస్తుందని సమాచారం..అదే సమయంలో ఈ ప్రతిపాదనను పవన్ కళ్యాణ్, జనసేన శ్రేణులు అంగీకరిస్తాయా అన్న దానిపైనా చర్చ జరిగిందట. అయితే పవన్ కళ్యాణ్ కి గతంలో చట్టసభల్లో పనిచేసిన అనుభవం లేకపోవడం, జనసేన సంస్థాగతంగా పూర్తిగా పట్టు సాధించకపోవడం, రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా లేకపోవడం లాంటి అనేక కారణాలవల్ల పవన్ కళ్యాణ్ 2024 కి ఈ ప్రతిపాదనని ఆహ్వానిస్తారని ఓ వర్గం భావిస్తోందట. గతంలోనే ఒక సందర్భంలో తనకు ముఖ్యమంత్రి కంటే అసెంబ్లీలో జనసేనకు కొంతమంది ఎమ్మెల్యేల అవసరం ఉందని, మొదటిగా తన ప్రయత్నం కూడా ఆ దిశగానే ఉంటుందని బహిరంగ సభలోనే పవన్ ప్రకటించిన అంశాన్ని వాళ్లు ప్రస్తావిస్తున్నారట. పవన్ కళ్యాణ్ పదవుల కోసం పాకులాడే నాయకుడేమీ కాదని రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా పురందేశ్వరి నాయకత్వాన్ని ఆమోదిస్తారని, అవసరమైతే పవన్ కళ్యాణ్ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకమైన శాఖకి కేంద్ర మంత్రి అయ్యే అవకాశం కూడా ఉంటుందని ఆ ప్రతిపాదనతో ముందుకు వెళితే జనసేన శ్రేణులు కూడా ఆహ్వానించవచ్చు అన్న ఆలోచన కూడా నడుస్తోందట. 2024లో పురందేశ్వరిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించినా ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేయడం అంత సులభం కాదు.. కాబట్టి అదే సమయంలో కేంద్రంలో బిజెపి వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని.. కేంద్ర మంత్రిగా అవకాశాన్ని ఇచ్చే ప్రతిపాదనలతో ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నట్టు కొన్ని వర్గాల నుంచి వస్తున్న సమాచారం. అందుకు ప్రయత్నాలు కూడా ప్రారంభమయ్యాయని, ఆ దిశగా ప్రాథమిక చర్చలు కూడా జరుగుతున్నట్టు బోగట్టా..!ఇప్పటివరకు విశాఖ పార్లమెంట్ నుంచి పురందేశ్వరి పోటీ చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఒకవేళ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదన వచ్చి, ఆ దిశగా ముందుకు వెళితే పురందేశ్వరి ఏ నియోజకవర్గంలో నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తారన్న చర్చ కూడా ప్రారంభమైంది.

గతంలో 2004లో బాపట్ల కాంగ్రెస్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనంతరం 2009లో విశాఖ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమె పోటీ చేసి విజయం సాధించి మళ్లీ కేంద్ర మంత్రి అయ్యారు. ఆ తర్వాత 2014లో రాజంపేట నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి అక్కడ ఓటమిపాలయ్యారు. 2019లో తిరిగి విశాఖ లోక్సభ నుంచి పోటీ చేసి కేవలం 30 వేల ఓట్ల మాత్రమే ఆమె సాధించారు. దీంతో 2024 ఎన్నికల్లో విశాఖ నుంచే లోకసభకు పోటీ చేస్తారని కూడా ఒక చర్చ నడిచింది. అయితే తాజా ప్రతిపాదన నేపథ్యంలో ఆమె తన సొంత నియోజకవర్గమైన పర్చూరు నుంచి పోటీ చేస్తారన్న ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతుంది. పర్చూరులో 2019లో పుందేశ్వరి భర్త దగ్గుపాటి వెంకటేశ్వర రావు వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యం ఉంది. గతంలో కూడా దగ్గుపాటి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన నేపథ్యం కూడా ఉండడం, స్థానిక బలం బలగం ఉన్న నేపథ్యంలో అదే సురక్షితమైన స్థానమని భావిస్తున్నారట. అదే సమయంలో విశాఖ నగర పరిధిలోని నియోజకవర్గాలను కూడా పరిశీలిస్తున్నారట. అయితే ఎక్కువ మంది మాత్రం పరుచూరి పైనే సిఫార్సు చేస్తున్నారట. ఒకవేళ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగాలంటే పరుచూరి అసెంబ్లీ నుంచి, లేదంటే ఆమెను ఎంపీ గానే పోటీ చేయించాలన్న ఆలోచన భారతీయ జనతా పార్టీకి ఉంటే.. విశాఖ నుంచి ఆమె పోటీ చేసే అవకాశాలు ఎక్కువ ఉన్నట్టు సమాచారం. అయితే, రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కావున 2024 ఎన్నికల్లో పురందేశ్వరి పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తికర చర్చ ఏపీ రాజకీయాల్లో నడుస్తోంది.

## సంపాదకీయం

# అర్ధాంతరంగా ముగుస్తున్న ఆశల సౌధాలు

దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువుతోన్న దాదాపు 8 వేల మంది ఐఐటీ విద్యార్థులు గత ఐదేళ్లలో డ్రాప్‌ఔట్లుగా ఉన్నట్లు కేంద్ర మంత్రి సుభాస్ సర్కార్ రాజ్యసభలో వెల్లడించారు. ఐఐటీల్లో సీటు సంపాదించేందుకు ఏటా లక్షల్లో విద్యార్థులు కఠోరంగా చదివి పోటీపడుతుంటారు. సాధారణంగా లక్షలు, కోట్లలో జీతాలు ఉండే ఉద్యోగాలంటే అందరికీ సాఫ్ట్ వేర్ రంగమే గుర్తొస్తుంది. అయితే ఆ ఉద్యోగాలు చేయాలంటే ఐఐటీ , ఐఐఎమ్ ఎన్ఐటీ వంటి గొప్ప చదువులు పూర్తి చేసి ఉండాలని అంతా అనుకుంటారు. కానీ ఇవేవి లేకుండానే ప్రముఖ ఆన్‌లైన్ కంపెనీ అమెజాన్‌లో ఓ వ్యక్తి కోటి రూపాయలకు పైగా వేతనంతో ఉద్యోగం సంపాదించాడు. అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో అనురాగ్ మకాడే అనే విద్యార్థి బీటెక్ చదువుతున్నాడు. ప్రతి ఏడాది ఐఐటీ పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు భారీ ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఇదే విద్యాసంస్థకు చెందిన అనేక మంది విద్యార్థులకు ఈ ఏడాది కూడా మంచి ప్లేస్‌మెంట్‌లు లభించాయి. కఠినమైన ఎంపిక ప్రక్రియను దాటుకొని ఎన్నో ఆశలతో సీటు పొందుతారు. ఐతే వీటిల్లో ప్రవేశం పొందిన కొందరు విద్యార్థులు మాత్రం మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఇలా 2019 నుంచి 2023 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు 8 వేల మందికిపైగా ఐఐటీ విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేసినట్లు కేంద్రమంత్రి సుభాస్ సర్కార్ రాజ్యసభలో వెల్లడించారు. బీజేపీ రాజ్యసభ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సుల్లో అత్యధిక సంఖ్యలో డ్రాపవుట్‌లు ఉన్నారని ఆయన చెప్పారు. అలాగే 2018 నుంచి 39 మంది ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఎయిమ్స్ క్యాంపస్‌లలో ఏడు మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. 2018 నుంచి ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 98 మంది ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. సెంట్రల్ యూనివర్సిటీ అత్యధిక సంఖ్య (17,454)ల్లో డ్రాపౌట్స్ ఉన్నట్లు మంత్రి తెలిపారు. తర్వాత ఐఐటీలు, ఆ తర్వాత ఎన్ఐటీల్లో డ్రాపౌట్‌లు అధికంగా ఉన్నట్లు తెలిపారు. ఐఐటీల్లో 8,139 మంది, ఎన్ఐటీల్లో 5,623 మంది, ఐఐఎస్ఈఆర్‌ల్లో 1,046 మంది, ఐఐఎంల్లో 858 మంది, ట్రిపుల్ ఐటీల్లో 803 మంది చదువును మధ్యలో ఆపేశారని తెలిపారు. ఒక విద్యార్థికి ఒక సబ్జెక్ట్‌లో రాణించాలంటే సహజమైన దృక్పథం మరియు ఆప్టిట్యూడ్ అవసరం, కానీ ఎవరైనా ఒక సబ్జెక్టును ఎంచుకోవలసి వచ్చినప్పుడు, వారు రాణించలేరు మరియు అది ఈ రకమైన తీవ్రమైన నిర్ణయాలకు లేదా డ్రాప్ అవుట్‌లకు దారి తీస్తుంది" అని ఆమె జోడించింది. క్యాంపస్‌లో సమగ్ర మానసిక ఆరోగ్య అధ్యయనం కోసం ఐఐటీ-మద్రాస్ విద్యార్థుల పోరాటం ఇంకా కొనసాగుతోంది. ఐఐటీ-మద్రాస్‌లోని స్వతంత్ర విద్యార్థి సంఘం చింతాబార్ బుధవారం ఒక ప్రకటనలో అడ్మినిస్ట్రేషన్ ఒక కమిటీని ఏర్పాటు చేసి 2019 తీర్మానం ప్రకారం అధ్యయనం ప్రారంభించాలని డిమాండ్ చేసింది. వేధింపులు, వివక్షత మొదలైన కేసులను చేర్చడానికి డిపార్ట్‌మెంట్‌లలో ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాల పరిధిని బలోపేతం చేయాలనే డిమాండ్‌లను మేము మరింత పునరుద్ఘాటిస్తున్నాము మరియు క్యాంపస్‌లో జరుగుతున్న మరణాలకు సంబంధించిన సమాచారాన్ని దర్యాప్తు చేయడానికి మరియు వ్యాప్తి చేయడానికి అనుసరించాల్సిన ప్రామాణిక కార్యాచరణ విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. పేలవమైన చదువులు, ఒత్తిడి, వ్యక్తిగత, వైద్యపరమైన కారణాల వల్ల వారంతా చదువు మధ్యలోనే మానేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఐఐటీలు.. విద్యార్థులకు చక్కటి అధ్యయన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. కేవలం అధ్యాపకులే కాకుండా సీనియర్లు, పూర్వ విద్యార్థులు కూడా ఫ్రెషర్స్‌కు సహకరిస్తున్నారు. వీటిని అందిపుచ్చుకోవాలి. నాలుగైదేళ్ల వ్యవధిలో తమను తాము సమాజ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మలుచుకోవాలి. ఐఐటీల్లో సీట్లు రాని విద్యార్థులు ఆ నిరుత్సాహాన్ని వీలైనంత త్వరగా విడనాడాలి. ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుంది. కానీ ఐఐటీల్లో సీట్ల పరిమితి కారణంగా అందరికీ సీటు సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. కష్టపడి చదివి అద్భుత విజయాలు సొంతం చేసుకోవాలి!!

## లహరి కేసులో భర్త వల్లభ్ రెడ్డి అరెస్టు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

నల్గొండ రాజకీయ నాయకుడి రంగసాయి రెడ్డి కుమారుడు వల్లబ్ రెడ్డి ని మర్డర్ కేసులో అరెస్ట్ చేసామని నారాయణగూడ సీఐ శ్రీనివాసు వెల్లడించారు. శనివారం సీఐ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. వల్లభ్, లహరి హిమాయత్ నగర్ లో లో నివాసం ఉంటారు. భార్య భర్తల మధ్య కొన్నిరోజులుగా మనస్పర్థలు వచ్చాయి. ఈ నెల 13 న రాత్రి లహరి ని వల్లభ్ తీవ్రంగా కొట్టాడరు. లహరి తలను గోడకు తలుపుకు బాదాడు. అహరి పొట్టలో కాలుతో బలంగా తన్నడం తో పొట్టలో రెండు లీటర్ల బ్లడ్ బ్లీడింగ్ జరిగింది. ఎవరికీ అనుమానం రాకుండా హార్ట్ ఎటాక్ పేరుతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసాడు. గుండె పోటుతో చనిపోయినట్లుగా అందరిని నమ్మించాడు. 24 న భార్య దినకర్మ కు 10 వేల మందికి భోజనాలు పెట్టి ఏమి తెలియనట్లు నటించాడు. పోస్టుమార్టం రిపోర్ట్ లో మర్డర్ వ్యవహారం తేలింది. వల్లబ్ కొట్టడం తోనే లహరి చనిపోయినట్లు నిర్ధారణ అయింది. లహరి తలపై గాయాలు ఉన్నట్లు కనిపిస్తున్నా ఆమె తల్లిదండ్రులు న్న అనుమానం వ్యక్తం చేయలేదు. లహరి తల్లితండ్రులను వల్లబ్ బెదిరించినట్లు అనుమానాలు వున్నాయి. వల్లబ్ నిందితుడు గా తేలడం తో అతనిపై సెక్షన్ 302 మర్డర్ , 201 సాక్షాల తారుమారు కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రేమండ్ తరలించాంమని అన్నారు.

## భద్రకాళి బండ్‌కి గండి

**పోతనగర్ సరస్వతి నగర్ వాసులకు పొంచి ఉన్న ప్రమాదం**

వరంగల్- ప్రభాత సూర్యుడు

భద్రకాళి బండ్ కు గండి పడింది. దాంతో పోతన నగర్ కు ముంపు ప్రమాదం ఏర్పడింది. పోతన్ నగర్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేదుకు వెళుతున్న వెళ్తున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు బిజెపి నాయకుల మధ్య తోపులాట జరిగింది. రాకేశ్ రెడ్ఇ అనుచరులు పురుషోత్తం, అనిల్ లను సిఐ చితకబాదాడు. బాధిత ప్రజలను కలుసుకోవడం వారికి సహాయనీ చేయడం లోఉన్న తప్పేంటని రాకేశ్ రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడం కూడా నేరమేనా ? అని నిలదీసారు.

# పర్యావరణ రక్షణకు పెద్ద పులి పాత్ర అత్యంత కీలకం

- పులులను మనం కాపాడితే, అవి అడవిని తద్వారా మనల్ని కాపాడుతాయి
- ఫారెస్ట్ కాలేజీలో ఘనంగా ప్రపంచ పెద్ద పులుల దినోత్సవం
- అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం. డోబ్రియల్




హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు :ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం హైదరాబాద్ (ములుగు) ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో ఘనంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా మారిన వాతావరణ పరిస్థితులు, పర్యావరణ రక్షణకు ముప్పుగా మారాయని, ఉన్న అడవుల సంరక్షణ మాత్రమే దీనికి అనువైన పరిష్కారమని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్ ఢ హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ అన్నారు. అడవుల రక్షణకు పులుల ప్రాధాన్యతే కీలకం అని, పులులను మనం కాపాడితే, అవి అడవినీ, తద్వారా ప్రజలను కాపాడుతాయని అన్నారు. ఈ విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించి, ఇతరులనూ చైతన్యవంతం చేయాలన్నారు. ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలు పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయని, ప్రస్తుతం దేశంలో 3,167 పులులు ఉన్నాయని తెలిపారు. అడవికి రాజులా పులి వ్యవహార శైలి, ప్రవర్తన గురించి ఆసక్తికరమైన విషయాలను ఈ సందర్భంగా పీసీసీఎఫ్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతతో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల్లో తీసుకున్న సంరక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య బాగా పెరిగిందని, రానున్న రోజుల్లో మరింతగా పులుల ఆవాసాలను అభివృద్ది చేస్తామన్నారు. అటవీ ప్రభావిత గ్రామాల పరిసరాల్లో జంతువులు, మనుషుల మధ్య సంఘర్షణ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. పులుల ఆవాసాల్లో అలజడిని తగ్గించేందుకు కోర్ ఏరియాల్లో ఉన్న గ్రామాల తరలింపు ప్రక్రియను చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం మేరకు భవిష్యత్ పర్యావరణవేత్తలను తీర్చిదిద్దుతున్న ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో రాష్ట్ర స్థాయి టైగర్ డే నిర్వహించటం శుభ పరిణామని డీన్ ప్రియాంక వర్గీస్ అన్నారు. అటవీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం అత్యంత ఉపయోగకరం అని అన్నారు. రాష్ట్ర స్థాయి అటవీ అధికారులు, ఉద్యోగులు, ఫారెస్ట్ కాలేజీ, ఫారెస్ట్ అకాడమీ (దూలపల్లి) నుంచి ట్రెయినీలు మొత్తం నాలుగు వందల మంది టైగర్ డే ఉత్సవాల్లో పాల్గొన్నారు. టైగర్ థీమ్ గా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ఉద్యోగులకు బహుమతులను అందించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల అభివృద్ధి, పురోగతిపై ఫీల్డ్ డైరెక్టర్లు వినోద్ కూమార్, క్షితిజలు కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పులుల రక్షణ కోసం అటవీశాఖ తీసుకుంటున్న చర్యలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఫారెస్ట్ కాలేజీలో కొత్తగా ప్రారంభిస్తున్న ఎం.ఎస్సీ (వైల్డ్ లైఫ్) బ్రోచర్ ను కార్యక్రమంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ తరపున ఇమ్రాన్ సిద్దికీ తాము పులుల సంరక్షణ కోసం చేస్తున్న పనులను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, అడిషనల్ పీసీసీఎఫ్ (ఐ.టీ) వినయ్ కుమార్, సీసీఎఫ్ రామలింగం, హైదరాబాద్ సీసీఎఫ్ సైదులు, ఫారెస్ట్ అకాడెమి డైరెక్టర్ ఆశ, ఫారెస్ట్ కాలేజీ అధికారులు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్ర ప్రజల శాపంగా కాంగ్రెస్ పార్టీ




గజ్వేల్ -ప్రభాత సూర్యుడు : సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని మంత్రి హరీశ్ రావు శనివారం ప్రారంభించారు. మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ బీజేపీ రైతు వ్యతిరేక చట్టాలు, వేలాది మంది రైతుల చావుకు కారణమైంది. మూడు గంటల కరెంటు చాలని తెలంగాణ ప్రజల శాపంగా కాంగ్రెస్ పార్టీ మారిందని ఆయా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ తీరుపైమండిపడ్డారు. మూడు పంటలు పండాలనే కేసీఆర్ ను కడుపులో పెట్టి చూసుకుందామని ఎవరూ తెలంగాణ ప్రజా సంక్షేమంపై ముందు చూపుతో వ్యవహరిస్తున్నారో.. ప్రజలు మీరే ఆలోచన చేయాల. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శిష్యుడు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి శిష్యుడు బీజేపీ కిషన్ రెడ్డిలు తెలంగాణ ప్రజలను మోసం చేసే పనిలో పడ్డారని, సద్దితిన్న రేవు తలవాలని సీఎం కేసీఆర్ ను నిండు మనస్సుతో దీవించాలని కోరారు. ఓవైపు తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమైక్యాంధ్ర మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు వింటున్నారని, మరోవైపు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాజీ సమైక్యాంధ్ర సీఎం చంద్రబాబు గురువని ఆయన చెప్పినట్లు వింటున్నారంటూ.. వీరిద్దరితో మన తెలంగాణ బతుకులు ఆగమైతయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎంలైన చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి ద్రోహులను అడ్డు పెట్టుకుని తెలంగాణ ఆత్మగౌరవాన్ని కుదువ బెట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.



# అసెంబ్లీ సమావేశాలకు అంతా రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఈ ఏడాదికి సంబంధించి ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు కావటంతో? అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం?. ఏమైనా ప్రకటనలు చేస్తుందా అన్న చర్చ మొదలైంది. మరోవైపు జులై 31న మంత్రివర్గ సమావేశం జరగనుంది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో వరదలు, ఇతర అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు సుమారు 50 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఆర్టీసీ ఉద్యోగులకు జీతభత్యాల పెంపు తదితర అంశాలపైనా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో సంభవించిన వరదలు, ప్రభుత్వ చర్యలపై కేబినెట్ సమీక్షించనున్నది. రాష్ట్రంలో వ్యవసాయ సాగు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో.. అకాల వర్షాల వల్ల వ్యవసాయ రంగంలో తలెత్తిన పరిస్థితులను అంచనా వేస్తూ అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై కేబినెట్ చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉధృతంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లి రోడ్లు తెగిపోవడం, రవాణా మార్గాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నది. అందుకు యుద్ధప్రాతిపదికన రోడ్లను తిరిగి పునరుద్ధరించడం కోసం చేపట్టనున్న చర్యలపై కేబినెట్ చర్చించనున్నది. అదే సందర్భంలో..ఆర్టీసీ సంస్థకు సంబంధించిన అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు అయ్యే అవకాశం ఉంది. అక్టోబర్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ మొదటి వారంలో ఎన్నికలు జరుగుతాయి. మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికలతో కలిపి నిర్వహించాల్సి రావడంతో డిసెంబర్ మొదటి వారానికల్లా పూర్తి చేస్తారు. జనవరి వరకూ అసెంబ్లీ గడువు ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం.. తొమ్మిదేళ్లలో తెలంగాణ సాధించిన ప్రగతిని..ప్రజల ముందు ఉంచేందుకు.. కేసీఆర్ సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో తెలంగాణ ప్రగతికి.. విపక్షాలు ఎలా అడ్డు పడుతున్నాయో అసెంబ్లీ వేదికగా చెప్పే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యంగా ఉచిత విద్యుత్ విషయంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను.. అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి కాంగ్రెస్ తీరును ఎండగట్టనున్నట్లుగా చెబుతున్నారు. కేసీఆర్ ఈ అసెంబ్లీ సమావేశాలను చాలా పకడ్బందీ వ్యూహంతో నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు కూడా గట్టి నమ్మకంతో ఉన్నాయి.

# వైరల్ వీడియోపై సీబీఐ కేసు

(మొదటిపేజీ తరువాయి)

అఫిడవిట్ దాఖలు చేసింది. ఇకపై ఈ కేసుని సీబీఐ విచారిస్తుందని అందులో పేర్కొంది. ఇప్పుడు అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ నెల 27వ తేదీన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకి అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసుని సీబీఐ విచారిస్తుందని వెల్లడించింది. మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలను సహించేది లేదని తేల్చి చెప్పింది. వీలైనంత వేగంగా ఈ కేసుని విచారించేలా చూడాలని కేంద్ర హోంశాఖ సుప్రీంకోర్టుని విజ్ఞప్తి చేసింది. మణిపూర్‌లో కాకుండా వేరే రాష్ట్రానికి కేసుని బదిలీ చేసి విచారణ కొనసాగించాలని కోరింది. మే 4న ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో ఇటీవలే వెలుగులోకి వచ్చి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం... ఈ కేసుని సుమోటోగా స్వీకరించింది. ఈ కేసుని 28వ తేదీనే విచారించాల్సి ఉన్నా...అఏఎ అందుబాటులో లేకపోవడం వల్ల వాయిదా పడింది. అయితే...ఇప్పటికే చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం కేంద్రానికి నోటీసులు ఇచ్చింది. మణిపూర్ ప్రభుత్వానికీ నోటీసులు పంపింది. వైరల్ వీడియో కేసులో నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశించింది. ఇప్పటి వరకూ ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు పోలీసులు. ఇండియా కూటమికి చెందిన 21 మంది ఎంపీలు మణిపూర్ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలోనే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆసక్తికరంగా మారింది. కేసు సీబీఐకి బదిలీ కావడంతో విచారణ త్వరగానే పూర్తవుతుందని నమ్ముతున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ విషయం మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది అయినప్పటికీ కూడా కేంద్రం తన శాయశక్తుల న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చినప్పటి నుంచి కేంద్రం ఈ కేసు గురించి తెలుసుకుంటూనే ఉంటున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికీ ఇంకా హింసాకాండ జరుగుతూనే ఉండటంతో బాధితులకు ప్రభుత్వం ఏదైనా సహాయక చర్యలు చేపట్టి వెంటనే పరిస్థితులు చక్కదిద్దాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది.

వారికి జీవనోపాధి పొందే విధంగా తగిన సహాయం అందించాలని, వృత్తి పరమైన శిక్షణతోపాటు హింసల వల్ల నష్టపోయిన వారికి తగిన ఉద్యోగావకాశాలు కూడా కల్పించడానికి కృషి చేస్తున్నట్లు కేంద్రం సుప్రీంకి తెలిపింది. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి నిత్యావసరాలతోపాటు మందులు అదుబాలుటులో ఉండేలా అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్టు సుప్రీం కోర్టుకు కేంద్రం వివరించింది. ఎప్పుడైతే మణిపూర్ లో హింస మొదలైందో అప్పటి నుంచి సాయుధ పోలీసు బలగాలు రాష్ట్రంలో మోహరించినట్లు కేంద్రం తెలిపింది.

## కొంపల్లిలో ఘనంగా మొహర్రం పండుగ



**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు**

శనివారం మొహర్రం (పీర్ల) పండుగను పునస్కరించుకొని కుత్బుల్లాపూర్ మండలం లోని కొంపల్లి లో పెద్ద ఎత్తున ఊరేగింపులు నిర్వహించారు. ఓ హెూ జంబియా ఒలంపల్లి జంబియా అంటూ కాలనీలు,బస్తీలు తిరుగుతూ పీర్ల ఊరేగింపు నిర్వహించి సందడి చేశారు. హిందూ ముస్లిం సోదర భావానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను కొంపల్లి వాసులందరూ సంబరాల్లో మునిగారు.

### సంగారెడ్డి బాలాజీనగర్ కాలనీలో
## వీధి కుక్కల వీరంగం

**సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** సంగారెడ్డి పట్టణం బాలాజీనగర్ కాలనీలో వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. ఐదు కుక్కలు వెంబడించి ఒక బాలుడిపై దాడి చేసాయి. పిల్లలు ఆడుకుంటుండగా వారిని కుక్కలు వెంబడించాయి. చిన్నారులు పారిపోవడానికి ప్రయత్నించారు. ఓ చిన్నారి అక్కడే పడిపోవడంతో బాలుడిపై దాడి చేసి కరిచాయి. పక్కనే ఉన్న ఓ మహిళ వీధి కుక్కలను తరమడంతో బాలుడు గాయాలతో బయటపడ్డాడు.

## పాముకు వినతి పత్రం

**కరీంనగర్ -ప్రభాతసూర్యుడు:** వినతిపత్రాలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఒక్కోసారి నేతల విగ్రహాలకు ఇవ్వడం చూసాం. కానీ కరీంనగర్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు వినూత్నంగా పాముకు వినతిపత్రం ఇచ్చిన వైనం ఇది. మల్యాల మండలంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు గత పక్షం రోజులుగా తమ డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్నారు. తమ గోడును ఎవరు పట్టించుకోవడం లేదని పాముకు వినతిపత్రం అందించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మల్యాల మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం ముందు కొన్ని రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు పాముకు వినతి పత్రం ఇవ్వడం చర్చనీ యాంశమైంది.

## జంపన్న వాగులో 8 మృతదేహాలు వెలికితీత



**ములుగు - ప్రభాతసూర్యుడు:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి జంపన్నవాగు ఉద్ధృతిలో గల్లంతైన 8 మృత దేహాలను వివిధ ప్రాంతాల్లో గ్రామస్తులు గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టి షరీఫ్, అజ్జు, రషీద్, మహబూబ్ ఖాన్, మజీద్ ఖాన్, బీబీ, కరీమ్ బీ, సమ్మక్క మృత దేహాలను జంపన్నవాగులో పవర్ బోటుల ద్వారా తీసుకొచ్చి బాధిత కుటుంబాలకు అప్పగించారు.

## టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు

**హైదరాబాద్ -ప్రభాతసూర్యుడు:** టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ లో చేరారు. బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన కోడేర్ మండలం బావాయిపల్లి మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఎంపీటీసీ మహేష్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

## కడెం ప్రాజెక్ట్ ను పరిశీలించిన డ్యాం సేఫ్టీ బృందం

**నిర్మల్ -ప్రభాతసూర్యుడు:**

నిర్మల్ జిల్లా లోని కడెం ప్రాజెక్టును సెంట్రల్,స్టేట్ డ్యాం సేఫ్టీ బృందం శనివారం పరిశీలించింది. 24 మందితో కూడిన బృందం సభ్యులు, వరదలకు గెట్లలలో ఎదురైన సమస్యలు, కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించింది. ప్రాజెక్టు స్థితిగతులు సేఫ్టీ సమస్యల పట్ల స్టేట్ సెంట్రల్ ఉన్నతాధికారులకు నివేదికలు అందించినట్లు అధికారులు తెలిపారు.

### ఎమ్మెల్యే ఇంటిముందు
## వరద బాధితుల ఆందోళన

**మంచిర్యాల -ప్రభాతసూర్యుడు:**

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావ్ ఇంటి ముందు వరద బాధితులు ఆందోళన చేశారు... తమ కాలనీలకు వరదలు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఎమ్మెల్యే, ఆయన అనుచరులు, కుమారుడు విజిత్ నచ్చ చెప్పే ప్రయత్నాం చేశారు ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది అంతలోనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను పంపించారు.

అనంతరం బాధితులు మాట్లాడుతూ కాళేశ్వరం జలాశయం నిర్మించడం వల్లనే తమ కాలనీలు మునుగుతున్నాయని ఆరో పించారు. బాలాజీ నగర్, రాం నగర్, ఎన్టీఆర్ కాలనీ, ఎల్ ఐ సి కాలనీ లకు చెందిన వారు ఈ ఆందోళనలో పాల్గొన్నారు తమ కాలనీలు ముంపునకు గురికా కుండా కరకట్ట నిర్మించాలని డిమాండ్ చేశారు.

# తబిత ఆశ్రమంలో బలరాం నాయక్ జన్మదిన వేడుకలు

**కమాన్ పూర్ -ప్రభాత సూర్యుడు :**

రామగుండం లోని తబిత ఆశ్రమంలో సింగరేణి ఐ ఆర్ ఎస్ డైరెక్టర్ బలరాం నాయక్ జన్మదిన వేడుకలు సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.సింగరేణి ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం తో ముందుకు తీసుక వెళ్తున్న కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న సీ అండ్ ఎండి శ్రీధర్ ఆదేశాల మేరకు అనుసరిస్తూ ముందుకు సాగుతున్న బలరాం నాయక్ ఐ ఆర్ ఎస్ డైరెక్టర్ పా కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం. 140 /18 అధ్యక్షులు డాక్టర్ ఎలకటూరి రాజేశ్వర్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు తబిత అనాధ ఆశ్రమంలో నీ పిల్లల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరపడం అయినది ఇట్టి కార్యక్రమములో కేకు కట్ చేసి పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమములో ఆర్ జి త్రీ ఏరియా లైసెన్ ఆఫీసర్ శ్ గడ్డం శ్రావణ్ కుమార్ కేంద్ర కమిటీ సభ్యులు ఇరుగురాల శ్రీనివాస్ శ్రీ బత్తుల శంకర్ కన్వీనర్, కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగినది.



### భద్రాద్రి- కొత్తగూడెం జిల్లాలో
# ముంపు ప్రాంతాలను పరిశీలించిన సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

**భద్రాద్రి -ప్రభాతసూర్యుడు:** కొత్తగూడెం- భద్రాచలం మధ్యన కిన్నెరసాని నది బ్రిడ్జి నుంచి గోదావరిలో కొట్టుకుపోయిన నాగారం చెక్ డ్యామ్ ను సిఎల్పీ నేత భట్టి విక్రమార్క శనివారం పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండు సంవత్సరాల క్రితం రూ.16 కోట్లతో నిర్మాణం చేసిన చెక్ డ్యామ్ గోదావరి వరదల్లో కొట్టుకుపోవడం నాసిరకంగా నిర్మాణం చేయడమే కారణం. చెక్ డ్యామ్ నిర్మాణం చేస్తున క్రమంలో ఇక్కడి ప్రజలు చాలాసార్లు అధికారుల వద్దకు వెళ్లి నాసిరకంగా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు సంబంధిత అధికారులు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఎవరు పట్టించుకోలేదని అన్నారు.అధికారుల నిర్లక్ష్యం, నాసిరకంగా కాంట్రాక్టర్ చేసిన నిర్మాణం వల్ల గోదావరి నదిలో చెక్ డ్యామ్ కొట్టుకుపోయి ప్రజాధనం వృధా అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం అనేక వాగులపై నిర్మించిన చెక్ డ్యామ్ లు వరదల్లో కొట్టుకు పోయాయి. 15 సంవత్సరాల కిందట నిర్మాణం చేసిన చెక్ డ్యామ్ లను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన క్రమంలో చూశాను. ఇంకా అవి అలాగే పటిష్టంగా, గట్టిగానే ఉన్నాయి. బిఆర్ఎస్ పాలనల్లో వేలాది కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన చెక్ డ్యాముల వరదల్లో కొట్టుకుపోవడం వల్ల ఆ నిధులు నీళ్లలో పోసినట్టుగా అయింది.బిఆర్ఎస్ నాయకుల కోసమో.., కార్యకర్తల లబ్ధి కోసమో ఈ చెక్ డ్యామ్ లను డిజైన్ చేసి ప్రభుత్వం అప్పగిస్తే నాసిరకంగా కట్టడం వల్ల రాష్ట్రంలో వందలాది చెక్ డ్యాములు నిర్మాణం కోసం



వెచ్చించిన ప్రజల సంపద వేల కోట్ల రూపాయలు ఇలా నీళ్లలో పోసినట్టుగా అయ్యిందని అన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని సమయాత్తం చేయకపోవడం వల్ల, వాళ్లను పాలన పరంగా వరద సహాయక చర్యల్లో పాల్గొనే విధంగా అప్రమత్తం చేయకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వరదల వల్ల ప్రాణనష్టం జరిగిన సంఘటనలు వెలుగు చూశాయి. ఇది చాలా దురదృష్టకరం. దీనికి బాధ్యత ప్రభుత్వ వైఫల్యం.ప్రభుత్వ యంత్రాంగాన్ని వాళ్ళ పని, వాళ్ళని చేసుకోనివ్వకుండ, బిఆర్ఎస్ పార్టీకి పనికొచ్చేటువంటి యంత్రాంగంగా, ప్రభుత్వ యంత్రాంగాన్ని మార్చడం వల్ల, ప్రజల కోసం పనిచేయడం వదిలి పెట్టి రాజకీయ పార్టీ కోసం పని చేసే యంత్రాంగంగా మారడం వల్ల, ఇలాంటి విపత్కర పరిస్థితి వచ్చినప్పుడు అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందడం వల్ల ప్రజలు తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజలు దీన్ని గమనించాలి.ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. ఇప్పటికైనా మిగతా కార్యకలాపాలు బంద్ చేసి పాలన యంత్రాంగం పై సమీక్ష చేయాలి. వరద ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న ప్రజలకు కావలసిన సహాయక చర్యలు అందించడమే కాకుండా నివారణ కావలసిన ప్లానింగ్, ఆలోచన చేయాలని అన్నారు.వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలకు అధికారులను వెంటనే పంపించి నష్టం అంచనా వేయించి నష్టపోయిన ప్రజలకు తగు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజలకు వెంటనే నష్టపరిహారం అందించని పక్షంలో పెద్ద ఎత్తున నష్టపోయిన ప్రజలు అహకారాలతో రాష్ట్రంలో పాలన లేదన్న మానసిక వేదనకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోవడం వెన్నతో పెట్టిన విద్య. గత సంవత్సరం భద్రాచలం ముంపు ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రూ. 1000 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి ఏడాది కావస్తున్నది. సీఎం మాటలు నీటి మూటలే తప్ప అమలుకు నోచుకోలేదని అయన ఆరోపించారు.



# రోడ్డు మరమ్మత్తులు చేపించిన మాదారం పోలీసులు

**తాండూర్ -ప్రభాతసూర్యుడు:** తాండూర్ రూరల్ సర్కిల్ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని లచ్చు పటేల్ గూడ కు నర్సాపూర్ నుండి వెళ్లే రోడ్డు కొద్ది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతినడం తో రాకపోకలు నిలిచిపోయాయి. ఈరోజు నీటి ప్రవాహం కూడా తగ్గడం తో రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజల ప్రయాణానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది అని ప్రజల అవస్థలను గుర్తించి బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆదేశాల తో తాండూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు సూచనలు ప్రకారం , మాదారం ఎస్ఐ రాజశేఖర్, గ్రామ సర్పంచ్, విలేజ్ పోలీస్ మల్లేష్, ఫ్రెండ్లీ పోలీస్, కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ రోజున ప్రజలు అత్యవసర సమయాల్లో ఇబ్బందులకు గురికాకూడదు అని మానవతా దృక్పదం తో తాత్కాలిక మట్టి రోడ్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు తెలుసుకొని



రోడ్డు మరమ్మత్తులు చేపించిన పోలీస్ అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపడం జరిగింది.అనంతరం తాండూర్ సీఐ మాట్లాడుతూ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు.ప్రస్తుతం వర్షం కొంచెం తగ్గుముఖం పట్టినప్పటికీ చెరువులు, నాళాలు, వాగులు నిండుగా ఉన్నాయి మరియు కొన్ని ప్రాంతాలలో కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు కొంతమంది పోలీస్ వారి హెచ్చరికలు, సూచనలు చేసిన పట్టించు కోకుండా వాహనాలతో వరద నీటి నుండి దాటడానికి ప్రయత్నం చేస్తున్నారు అట్టి చర్యలు ప్రమాదకరం.ేంపు, ఎల్లుండి సెలవులు కావున చాలా మంది ఇతర ప్రాంతాల నుండి, స్థానిక ప్రజలు వరద నీరు ప్రవహించే ప్రాంతాలను చూడడానికి, చేపల వేటకు వచ్చే అవకాశం ఉంది కావున ముందస్తుప్రజల భద్రత మరియు ప్రాణా రక్షణ ను దృష్టిలో పెట్టుకొని సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ఎవరు ప్రజలు వెళ్లకూడదని ప్రజలు అందరు పోలీస్ వారికి సహకరించగలరు అని సీఐ కోరడమైనది.తాండూర్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు.

## 31న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో “సిపిఎస్ రద్దు పైన సానుకూల నిర్ణయం

**సూర్యాపేట-ప్రభాతసూర్యుడు:** ఈ నెల 31న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సిపిఎస్ రద్దు గురించి చర్చించి, సానుకూల నిర్ణయం ప్రకటించాలని టి ఎస్‌సి పి ఎస్ ఇ యూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు శనివారం నాడు కోదాడలో పత్రికా ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక సామాజిక భద్రత, గ్యారెంటీ లేని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్రంలో 2 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగ కుటుంబాలు గత 7 సంవత్సరాల నుండి అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో అనేక పోరాట ఉద్యమాలు చేస్తూ ప్రభుత్వాన్నీ కోరుతున్నారు. నెల 16 నుండి 31 వరకు టి ఎస్ సి పి ఎస్ ఇ యూ సారధ్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర దిగ్విజయంగా నిర్వహించబడుతున్నది. కొద్ది నెలలలో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఇప్పుడున్న ప్రభుత్వమే సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాల్సిందే నని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు వివిధ దశలలో పోరాట ఉద్యమాల ద్వారా డిమాండ్ చేస్తున్నా యి. ఉద్యోగుల స్నేహపూరిత ప్రభుత్వం అని చెప్పుకునే ,ధనిక రాష్ట్రంలో ఎన్నికలకు ముందే సిపిఎస్ ని రద్దుచేసి దక్షిణ భారతదేశంలో మొదటి రాష్ట్రంగా ఆదర్శంగా నిలవాలని, తుదన ్గుణంగా ఈనెల 31న జరిగే మంత్రివర్గ సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకొని ప్రకటించాలని కోరారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215